# పండుమాంసం

కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

"చెప్పరా! చెప్పు" అంటూ నాయరు పిల్లవాణ్ణి గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు. ఆ పసివాడు నిస్సహాయంగా చేతులు అడ్డం పెట్టుకొని దెబ్బలు తగలకుండా వుండేందుకు విఫలయత్నం చేస్తున్నాడు. నామనస్సు వికలమయింది. ఆ దృశ్యం నా 'మూడ్'ను పూరిగా పాడు చేసింది. తెల్లవారు ఝామున నాయరు హోటల్‌కు వెళ్ళి టీ తాగితే తప్ప నాకు మూడ్ రాదు. ఆ సమయంలో అతని హోటల్ తప్ప మరి ఎవరిదీ తెరచి వుండదు. రాత్రి ఆలశ్యంగా మూసేదీ, మర్నాడు పెందరాళే తెరిచేది ఆ సెంటర్‌లో నాయరు ఒక్కడే. నాయరు నిశాచరుడేమోనని అప్పుడప్పుడు అనుకుంటూంటాను. అలా అనుకోవటం ఇంత కాలం అన్యాయమేమో కానీ ఇప్పుడు ఈ దృశ్యం చూసిన మీదట నేను అలా తలంచటం సబబే అనిపిస్తోంది.

"ఎందుకు నాయరూ! వాణ్ణి అలా బాత్తావ్!" నాయరుతో నాకున్న పరిచయాన్ని పురస్కరించుకొని వాడి గొడవలో తల దూర్చాను.

ఆ మాత్రం స్వతంత్రం నాకుంది. నాయరు ఈ వూరొచ్చి ముప్పై సంవత్సరాలు పైగానే అయింది. ఒక్క పేరులో తప్ప మిగతా అన్ని విషయాల్లో నాయరు తెలుగు వాడే. తెలుగు మాట్లాడటమే కాదు, తెలుగు పేపరు చదవటం, తెలుగు రాజకీయాలు చర్చించటం, తెలుగు ఓటు వేయటం కద్దు. ఈ వూరు వచ్చిన కొత్తల్లో ఎక్కడా నెమలు బాటు లేనప్పుడు నేను అంతో యింతో సాయపడ్డాను. అది అతడు ఎంత వరకు గుర్తుంచుకున్నాడో నాకు తెలియదు కాని నేను మాత్రం మర్చిపోలేదు. అందుకే అన్నట్టు అతని హోటల్‌కు క్రమం తప్పకుండా వెళుతూ వుంటాను.

నా హెచ్చరిక నాయర్ వినిపించుకున్నట్టు లేదు, వినపడక కాదు, అర్థం కాక అంతకన్నా కాదు—ఆ క్షణంలో నా మాటలు పట్టించుకోవటం కంటే తన కోపం చల్లార్చుకోవటమే ముఖ్యమని అతని భావన. నన్ను అలా అలక్ష్యం చేయటం వల్ల నా మనస్సు చివుక్కుమంది. కుర్చీలో నుంచి లేచి అడ్డుపడి ఆపుదామనుకున్నాను. కాని నా పెద్దరికానికి అది తగిన పనికాదు. అందుకే మరోసారి ప్రయత్నిద్దామనుకుని "ఎందుకయ్యా పొద్దునే అంత కోపం, కాస్త నిదానించు" అంటూ బిగ్గరగా అన్నాను.

"మీకు తెలవదు సంతులుగారూ! వీడు తెగ బలిసి కొట్టుకుంటున్నాడు. దేహశుద్ధి జరిగితే కాని దారిలోకి రాడు" నాయర్ మాటల్లోని తెలుగు తనానికి మరో సందర్భంలో అయితే ముచ్చటపడే వాడ్నే. కాని ఇప్పుడు మాత్రం చిర్రెత్తుకొచ్చింది. ఎంత కోపంలో వుంటే మాత్రం చిన్నా పెద్దా తారతమ్యం తెలీకుండా నన్ను అలక్ష్యం చేస్తాడా అని మనస్సు మూలిగింది. ఇంతగా నీర్ర నీగుతున్న నాయర్ ఒకప్పటి పరిస్థితి నాకు తెలియనిది కాదు.

రోడ్డు పక్క ఒక చిన్న పంచలో టీ కొట్టు పెట్టుకుని రోజు గడిస్తే చాలన్నట్టు బతికే వాడు. ఒంట్లో బాగోనప్పుడు, అప్పులవాళ్ళు వేధిస్తున్నప్పుడు మా యింటికి వచ్చి నా ముందు నేల మీద కూర్చుని ఏడుస్తున్నట్టు, తన కష్టాలు ఏకరవు పెట్టేవాడు. అప్పటికీ యిప్పటికీ నేను యిలానే వున్నా, నాయరు మాత్రం ఎంతో ఎదిగి పోయాడు. టీ అంగడి కాస్త హోటలుగా మారింది. కాలి నడకన వెళ్ళేవాడు స్కూటరు మీద తిరుగుతున్నాడు. ఎంగిలి గ్లాసులు కడిగేవాడు యజమాని అయి పెత్తనం చలాయిస్తున్నాడు. ఇవన్నీ నాలో అసూయ కలిగించలేదు. కాని నన్ను యిలా అలక్ష్యం చేస్తూ ఆ కుర్రాణ్ణి అలా కొడుతూండటం నాకు బాధనిపించింది.

గతం మర్చిపోతే మనిషి మృగం కంటే హీనమవుతాడు. అప్పట్లో నాయరు ఒక షాపు ముందు వసారాలో టీ దుకాణం పెట్టుకున్నాడు. ఒక రోజు ఆ షాపులో లూటీ జరిగింది. ఆ లూటీతో నాయరుకు సంబంధం వుందన్న అనుమానం కొద్దీ పోలీసులు అతణ్ణి అరెస్టు చేశారు. ఇలాంటి కేసుల్లో తల దూర్చటం ఎందుకని ఎవరూ పట్టించుకోలేదు. కాని ఓ మళయాళీ వచ్చి "నాయరును లాకప్‌లో పెట్టారు. మీరు కలగజేసుకోకపోతే వాడు ప్రాణాలతో మిగలడు" అంటూ చెప్పేప్పటికి నాకు కంగారు కలిగింది. వెళ్ళి జామీను మీద విడుదల చేయించాను. ఆ తర్వాత ఎలానో కేసు కొట్టేయించాను.

ఇన్ని విషయాలు నాయరుకు ఆ క్షణంలో ఎలా గుర్తు చేయగలను? పోనీలే అనుకొని ఎలా ఉపేక్షించగలను? కానీ ఏదో అతీతశక్తి అడ్డుకుంటే బాగుణ్ణు అని మాత్రం నేను ఆశించాను.

సరిగ్గా నేను ఆశించినట్టే జరిగింది. నాయర్ పైకి లేచిన చెయ్యి లేచినట్టే వుండి పోయింది. ఏదో యంత్రం పని చేస్తూ చేస్తూ పవర్ కట్ వల్ల పైకి లేచినది లేచినట్టు ఆగిపోయింది. నాకు ఆశ్చర్యం కలిగింది. ఎవరు ఆ చేతిని బలంగా పైకి ఎత్తి వుంచగలిగారు? ఏ శక్తి నాయర్‌ని క్రియాశూన్యుణ్ణి చేసింది?

బలంగా పిల్లవాడి మీద ప్రయోగించాలనే సంకల్పంతో నాయరు చేయి పైకెత్తినప్పుడు అసంకల్పితంగా పిల్లవాడు



22-9-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

## తెలుగు కళాసమితి (న్యూ జెర్సీ) చిన్న కథల పోటీలో రు. 200 గెలుపొందిన రచన

కెవ్వున కేక పెట్టాడు. "నాన్నా! నన్ను చంపకు" అంటూ. అదే! ఆ కేక నాయరులో వున్న మనిషిని తట్టి లేపింది. ఆ గావుకేక నాయరులో వున్న పిశాచాన్ని తరిమి కొట్టింది. ఆ ఆర్తనాదమే గుండె గుహలో నిద్రిస్తున్న మమకారానికి రూపం యిచ్చింది.

నాయరు ఈ ఊరు ఎలా వచ్చాడో నాకు తెలుసు. అతనికి చదువు సంధ్యలు లేవు. అతని తండ్రికి యిలాంటివి వుంటాయని, వాటి అవసరం మనిషికి వుంటుందని తెలియదు. మనిషి యంత్రమని, పనిచేస్తే డబ్బు ఉత్పత్తి చేస్తాడని బాగా తెలుసు. అందుకే ఊహ తెలియక ముందే నాయర్ని హోటల్లో పనికి కుదిరించాడు. నాయరు తిండి అక్కడే గడిచి పోయేది. రాత్రి బాగా అలసిపోయి ఇంటికి వస్తూ వస్తూ యజమాని యిచ్చిన రెండు రూపాయిలు తెచ్చేవాడు. ఒకరోజు మిత్రుల ప్రోత్సాహంతో నాయరు రెండవ ఆట సినిమాకు వెళ్ళి మిత్రులతో జల్సా చేశాడు. రెండవ ఆట వదిలిన తర్వాత వట్టి చేతులతో యింటి వచ్చిన కొడుకుని చూసి నాయరు తండ్రి శివమెత్తాడు. నడుముకు వున్న బెల్టు విప్పి వళ్ళు వాతలు తేలేట్టు కొట్టాడు. "నాన్నా నన్ను కొట్టకు, చంపకు" అని ఎంత మొత్తుకున్నా అతని కోపం చల్లారలేదు. కోపం, పగా రెండూ వేరయినప్పటికీ పగ వల్ల కోపం, కోపం వల్ల పగ ఏర్పడడం సహజం. నాయరు తండ్రి విషయంలో కోపం పగగా మారింది. అందుకే నాయరు తండ్రికి కొడుకు శత్రువులా కనపడ్డాడు. పగవున్న చోట మమకారానికి స్థానం లేదు. అందుకే ఆ నాటి నుండి తండ్రీ కొడుకుల బంధం తెగిపోయింది. ఇంట్లో అందరూ నిద్ర పోతుండగా ఆ రాత్రికి రాత్రే నాయరు చక్కా వచ్చేశాడు. ఆ నాటి నుంచి మళ్ళీ ఆ యింటి గడప తొక్కింది లేదు.

"నాన్నా!" అన్న ఆ పిలుపుకు గడ్డ కట్టిన గుండె మళ్ళీ కొట్టుకుంది. గతం జాలు విదిల్చింది. ఒకనాటి తన దైన్యం పసివాని రూపంలో ఎదురుగా నిలబడి రోదించింది. అందుకే నాయరు శిలా ప్రతిమలా ఎత్తిన చెయ్యి దింపలేక పోయాడు.

కృతజ్ఞత చేయలేని పని స్వానుభవం చేయగలిగింది. ఇంతకీ నాయరుకు ఆ పసివాడిపై ఎందుకంత కోపం?

ఏముంది? వడ్ల గింజలో బియ్యపు గింజ.

నాయరు నా దగ్గరకు వచ్చి "అయ్యా! తమకు ఏం కావాలి?" అంటూ వినయంగా అడిగాడు.

"నాకు కావల్సింది నువ్వు ఎప్పుడో యిచ్చావు" అన్నాను తృప్తిగా.

నేను చిన్న బుచ్చుకుని అలా అన్నానేమో అనుకుని "అలాకాదు, మీరు ఏదైనా తీసుకోవాలి" అంటూ నాయరు ప్రాధేయ పూర్వకంగా అడిగాడు. జరిగిన సంఘటనకు పశ్చాత్తాప పడుతున్నట్టుంది అతని అభ్యర్థన.

నాకు ఏమి అడగాలో తోచలేదు. చిన్నప్పుడు చదివిన ఓ కథ గుర్తుకు వచ్చి నాలో నేను నవ్వుకుంటూ అన్నాను "ఎండు మాంసం" అని.

షాక్ తగిలినట్టు నాయరు నా వంక చూశాడు. నేను కుర్చీలోంచి లేచి తాపీగా బయటకు వచ్చాను.

ఆ కథ ఏమిటో నాయరుకు నేను ఎప్పుడూ చెప్పలేదు. కానీ మీకు చెప్పక పోతే బాగుండదని చెబుతున్నాను. ఒక రోజు ఓ ముసల్ది ఓ అంగటికి వెళ్ళింది. షావుకారు "ఏం కావాలి?" అని ముసల్దాన్ని అడిగాడు.


"నాకు పట్టె మంచం కావాలి, పల్లకి కావాలి, మంచి గంధం చెక్కలు కావాలి. కానీ అవన్నీ నీ దగ్గర లేవుగా. అందుకే రెండు పైసలకు కాస్త ఎండు మాంసం యివ్వు" అంది.


షావుకారు ముసల్దానికి ఎండు మాంసం యివ్వలేదు కానీ అది చచ్చేంత వరకు తిండి గింజలు యిచ్చాడు.


అదో! ఆ కథ గుర్తు వచ్చే నాయర్ని అలా అడిగాను.

కథ మొదటికి వస్తే నాయరు కోపానికి కారణం ఏమిటని మీరు అడగనూ వచ్చు. నేను చెప్పనూ వచ్చు. కానీ ఏం లాభం? చివరకు నాయరు ఎండు మాంసం కాదుగా! మమకారం వున్న గుండె ఎండు మాంసం ఎందుకవుతుంది?

(రెండవ ఆట సినిమా చూసి ఆ పసివాడు అప్పుడే పనిలోకి వచ్చాడు. అనిద్ర వల్ల నిలబడే నిద్రపోతున్నాడు.) ●









22-9-89 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక